నేనే నంబర్ 2

సీఎం తర్వాత నేనే.. నాదే బలమైన శాఖ

- మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు
- సీనియర్ మంత్రుల గుర్రు

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ముఖ్యమంత్రి తర్వాతి స్థానం ఎవరిది? సాధారణంగా ఉపముఖ్యమంత్రిని నెంబర్ 2గా పరిగణిస్తారు. ఆ పదవిలో ఎవరూ లేకపోతే హోంశాఖ మంత్రికానీ, సీనియర్ మంత్రి కానీ రేస్‌లో ఉంటారు. ప్రస్తుతం ఉప ఉపముఖ్యమంత్రిగా మల్లు భట్టి విక్రమార్క వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు లాంటి సీనియర్ మంత్రులు ఉన్నారు. వీరికి ఉమ్మడి రాష్ట్రంలోనూ మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉన్నది. కానీ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాత్రం రాష్ట్రంలో తానే ముఖ్యమంత్రి తర్వాత అంతటి పవర్‌ఫుల్ మంత్రిని అని చెప్పుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు, ఆయన తీరుపై ఇతర మంత్రులు అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మొదటిసారి మంత్రి పదవి చేపట్టిన వ్యక్తి తానే అంతా అన్నట్టుగా వ్యవహరిస్తుండటాన్ని పలువురు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒక్కసారి మంత్రి అయినవాళ్లే తనది ముఖ్యమైన శాఖ అని, ముఖ్యమంత్రి తర్వాత స్థానంలో ఉండే శాఖ అని చెప్పుకోవడం ఏమిటని అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన ఒక కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 'అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ. ఇందిరమ్మ రాజ్యం మీ దయతో ఉన్నది. ఈ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తర్వాతి స్థానంలో మీ అందరి దీవెనలతో రెవెన్యూమంత్రిగా నేను ఉన్నాను. నా గురించి మీకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒక మాట ఇస్తే తప్పే వ్యక్తిని కాను' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఖమ్మం జిల్లా నుంచే ముగ్గురు మంత్రులు ఉన్నారు. వీరిలో భట్టి ఉపముఖ్యమంత్రిగా, తుమ్మల వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. అయితే, పొంగులేటి మాత్రం ఖమ్మం జిల్లాలో జరిగే సమావేశాల్లో రాష్ట్ర మంత్రివర్గంలో తానే నెంబర్ 2 అని చెప్పుకోవడం వివాదస్పదమవుతున్నది. బహిరంగసభల్లో కూడా ఇలాగే చెప్తుండటంపై అధికారులు సైతం విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని జిల్లాలో పలువురు ప్యారాచూట్ నేతలు ఉన్నారని, వారికి మంత్రి పదవులు చాలునని వ్యాఖ్యానించారు. ఆమె పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి మాట్లాడారని పార్టీ కోడైకూస్తున్నది.

ఇందూరులో పక్షుల సందడి

నిజామాబాద్ జిల్లా చందూరు మండలం కారెగాం తండాలోని చెరువుల్లో వివిధ జాతులకు చెందిన తెల్లని, నల్లని పక్షులు కనువిందు చేస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయలో భాగంగా చెరువుల్లో పూడిక తీయడంతో నీరు ఎక్కువగా ఉండటంతో పక్షులు సేద తీరుతున్నాయి. ఈ దృశ్యాన్ని 'నమస్తే' క్లిక్ మనిపించింది. - నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- లోక్‌సభ ఎన్నికలు, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు!
- నామినేటెడ్ పోస్టుల భర్తీపై అధిష్ఠానంతో చర్చ

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సహా మంత్రులంతా గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. వీరి వెంట పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా వెళ్తారు. లోక్‌సభ ఎన్నికలు, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక, గవర్నర్ కోటాలో ప్రతిపాదించే ఎమ్మెల్సీ అభ్యర్థులు, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై అధిష్ఠానంతో చర్చించేందుకే వీరు ఢిల్లీకి వెళ్తున్నట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ తదితరులు రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేయనున్నట్టు తెలిసింది. ఈ నెల 15న సీఎం అమెరికా (దావోస్) పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడి నుంచి తిరిగి వచ్చాక లోక్‌సభ నియోజకవర్గాలకు సమన్వయకర్తలతో సమీక్షలు నిర్వహిస్తారని కాంగ్రెస్ వర్గాల సమాచారం.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులపై కసరత్తు

సీఎం ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఈ అభ్యర్థిత్వం కోసం కాంగ్రెస్ నేతలతోపాటు తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ వంటివారి పేర్లను కూడా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేయాలని సీఎం కోరనున్నట్టు సమాచారం. రెండో ఎమ్మెల్సీ అభ్యర్థిగా మైనార్టీ నాయకులకు అవకాశం కల్పించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే కోటాలో మైనార్టీలకు అవకాశం కల్పించే పక్షంలో ఫిరోజ్‌ఖాన్, షబ్బీర్ అలీ పేర్లు పరిశీలించే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

విదేశీ ప్రతినిధులకు సీఎం రేవంత్ విందు

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): విదేశీ ప్రతినిధులకు సీఎం రేవంత్ బుధవారం విందు ఇచ్చారు. హైదరాబాద్‌లోని కుతుబ్ షాహీ టూంబ్స్ వద్ద ఇచ్చిన ఈ విందుకు అమెరికా, ఇరాన్, తుర్కియే, యూఏఈ, యూకే, జపాన్, థాయిలాండ్, జర్మనీ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఫిన్లాండ్ దేశాల ప్రతినిధులు ఈ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ సాదర స్వాగతం పలికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యమిస్తున్నామని, యువత భవిష్యత్తుకు, పారిశ్రామిక అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. అన్ని దేశాలతో సత్సంబంధాలు కొనసాగించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలని ఆయా దేశాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, హైదరాబాద్ రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహజ తదితరులు పాల్గొన్నారు.

నడిమిట్ల నరకం

> మొదటిపేజీ తరువాయి...

ఉంటుంది. గత కేసీఆర్ సర్కారు ధాన్యం కొనుగోలు అంశంలో ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేసేది. రైతులు కూడా ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చామంటే వారం- పదిరోజుల్లో డబ్బులు వస్తాయన్న ధీమాతో ఉండేవారు. కానీ, ఈసారి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి నెల గడుస్తున్నా కాంగ్రెస్ సర్కారు ఇంకా పూర్తిస్థాయిలో డబ్బులు వేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా జనవరి తొమ్మిదో తేదీ వరకు ధాన్యం పండించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పౌరసరఫరాల సంస్థ ద్వారా అందాల్సిన డబ్బులు అక్షరాల రూ.వెయ్యి కోట్ల వరకు ఉన్నాయి. ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడంలేదు. రాష్ట్రంలో 6,718 ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టారు. వీటి ద్వారా 45 లక్షల 28 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. వీటికి సంబంధించి నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. వాస్తవానికి చెప్పాలంటే నిరుడుతో పోలిస్తే ఈసారి సుమారు 18 లక్షల టన్నుల ధాన్యం తక్కువగా వచ్చింది. ధాన్యం తక్కువగా కొన్నప్పటికీ నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రభుత్వం వద్ద నిధులు ఉన్నప్పటికీ రైతులకు డబ్బులు విడుదల చేసే విషయంలో జాప్యం చేస్తున్నట్టు తెలుస్తున్నది.

అందని పెట్టుబడి సాయం!

ప్రభుత్వం నుంచి ధాన్యం అమ్మిన డబ్బులు రాకపోయినా కనీసం రైతుబంధు అయినా వస్తుందని ఆశగా చూసిన రైతులకు అడియాశే మిగిలింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధును విడుదల చేయకపోవడంతో ఏం చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. రైతుబంధు వస్తే వేడినీళ్లకు చన్నీళ్లు తోడుగా ఉండేదని, వ్యవసాయ పనులైతే మొదలుపెట్టుకునేవాళ్లమని రైతులు అంటున్నారు. పనులు మొదలుపెట్టుకున్న తర్వాత ప్రభుత్వం నుంచి ధాన్యం అమ్మిన సొమ్ము వస్తే ఆ సొమ్ముతో యాసంగి పంటను పండించుకునేవాళ్లమని చెప్తున్నారు. రైతుబంధు రాక.. ధాన్యం డబ్బులు అందక తప్పని పరిస్థితుల్లో మళ్లీ ప్రైవేటు అప్పుల కోసం తిరగాల్సి వస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన నేపథ్యంలో తమకు ఇప్పుడు బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వడంలేదని వాపోతున్నారు. పాత అప్పు తీరిస్తేనే కొత్తది ఇస్తామని చెప్తున్నారని, కొత్త అప్పు పుట్టకపోవడం, పాత అప్పు తీరకపోవడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యిందని అంటున్నారు. ప్రభుత్వం తమ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తుందో.. ఎప్పుడు రైతుబంధు నిధులను విడుదల చేస్తుందోనని వేయి కండ్లతో ఎదురుచూస్తున్నామని చెప్తున్నారు.

ఎదురు చూసుడైతంది

"గతంలో సీజన్‌కు ముందే రైతుబంధు పడేది. కానీ, ఇప్పుడు ఎదురు చూసుడైతంది. రైతుబంధు ఎక్కువ ఇస్తమని చెప్పిన కాంగ్రెసోళ్లు ఇప్పటికీ ఇవ్వకుండా మాట తప్పుతున్నరు. కనీసం గత ప్రభుత్వం ఇచ్చినంత కూడా ఇస్తలేరు. యాసంగి నాట్లు పూర్తయితున్నయ్. కానీ, ఇంకా రైతుబంధు రాలేదు. రైతుబంధు వస్తే పెట్టుబడి భారం తప్పేది. కానీ, ఇప్పుడు అన్ని ఖర్చులూ మేమే భరించేసరికి ఇబ్బందయితంది. నాకు నాలుగు ఎకరాలకు రూ.20 వేలు ఖాతాలో జమయ్యేవి.

- సిరికొండ శ్రీధర్‌రావు, రామకృష్ణకాలనీ, తిమ్మాపూర్ మండలం, కరీంనగర్ జిల్లా

డ్రైపోర్ట్‌ల ఏర్పాటుపై త్వరలో నిర్ణయం

- రెండు ప్రాంతాలను పరిశీలిస్తున్నాం
- కొత్త పాలసీ తీసుకొస్తాం
- పారిశ్రామికవేత్తలతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ భేటీ

హైదరాబాద్, జనవరి 10(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డ్రైపోర్ట్‌ల ఏర్పాటు అంశంపై త్వరలోనే కీలక నిర్ణయం తీసుకుంటామని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. డ్రైపోర్ట్‌ల ఏర్పాటుకు నల్లగొండతోపాటు కనెక్ట్ టు ఓల్డ్ ముంబై హైవే ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌టీసీసీఐ భవన్‌లో మంత్రి శ్రీధర్‌బాబు ఎఫ్టీసీసీఐ, ఫిక్కీ, సీఏఏ, ఎఫ్టీఎస్ఏసీ, డిక్కీ తదితర సంఘాల ప్రతినిధులు, పారిశ్రామిక రంగానికి చెందిన పలువురు ప్రముఖులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, త్వరలోనే నూతన పారిశ్రామిక పాలసీ తీసుకొస్తామని చెప్పారు. అర్బన్ క్లస్టర్, రీజనల్ క్లస్టర్, సెమీ అర్బన్ క్లస్టర్.. ఇలా మూడు పద్ధతుల్లో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తామని వివరించారు. హైదరాబాద్‌ను ఫార్మా ఇండస్ట్రీ హబ్‌గా ఇతర దేశాలు సైతం గుర్తిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో మిస్సైల్ తయారై.. ఇజ్రాయిల్‌కి ఎగుమతి అవుతున్నదంటే రాష్ట్రంలో పారిశ్రామిక రంగం ఎంతగా అభివృద్ధి చెందిందో అర్థంచేసుకోవచ్చునని పేర్కొన్నారు. తాము 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తామన్న ఎన్నికల హామీని నెరవేరుస్తామని తెలిపారు. పారిశ్రామికరంగంలోనూ మరిన్ని లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు పారిశ్రామికవర్గాలు చొరవ చూపాలని కోరారు.

రాహుల్ వ్యతిరేకించింది అదానీనే.. అభివృద్ధిని కాదు

అదానీ కంపెనీ వ్యవహారంలో కొంత మంది కావాలని కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. అన్ని వర్గాల పారిశ్రామికవేత్తలకు అవకాశం రావాలన్నది కాంగ్రెస్ పార్టీ ఉద్దేశమని, తమ నాయకుడు రాహుల్‌గాంధీ అదానీని వ్యతిరేకించారు తప్ప అభివృద్ధిని కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అదానీతోపాటు అనేక ఇతర కంపెనీలు ఉన్నాయని పేర్కొన్నారు. కరోనా వల్ల ఎంఎస్ఎంఈ పరిశ్రమలు చాలా ఇబ్బందిపడ్డాయని, అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం అందించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు తోడ్పాటు అందిస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో అనేక పరిశ్రమలు ఏర్పడటమే కాకుండా ప్రభుత్వ సంస్థలను ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్టు వివరించారు.

త్వరలో కొత్త పవర్ పాలసీ

> మొదటిపేజీ తరువాయి...

కొనుగోళ్లు, విద్యుత్తు డిమాండ్, సరఫరా పరిస్థితులు, డిస్కంల ఆర్థిక పరిస్థితి, పనితీరును అధికారులు సీఎంకు వివరించారు.

రాష్ట్రానికి కొత్త విద్యుత్తు విధానం

రాష్ట్రానికి సమగ్ర విద్యుత్తు విధానం లేకపోవటంతో ఎన్నో రకాల సమస్యలు వస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వివిధ రాష్ట్రాల విద్యుత్తు విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి, శాసనసభలో అన్ని రాజకీయ పక్షాలతో చర్చించి సమగ్ర విద్యుత్తు విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. విద్యుత్తు రంగ నిపుణులతో సైతం చర్చిస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన విద్యుత్తు విధానం రూపకల్పన చేస్తామని వెల్లడించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. గృహజ్యోతి పథకం ద్వారా ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రంగంలో కొత్త విద్యుత్తు కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని, నిర్మాణంలో ఉన్న విద్యుత్తు కేంద్రాలను సత్వరంగా పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్తు దుర్వినియోగాన్ని అరికట్టి, నాణ్యతను పెంచాలని తెలిపారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, డీ శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కనీస వేతనాలను సవరించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఐఎన్‌టీయూసీ విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం గతంలో విడుదల చేసిన కనీస వేతనాల సవరణ జీవోలను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ కార్యదర్శి దేవసాని భిక్షపతి కోరారు. బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్‌తోపాటు కలిసి సచివాలయంలో సీఎంకు వినతిపత్రం అందజేశారు. 16 ఏండ్లుగా కనీస వేతనాల సవరణ జరగక 1.20 కోట్ల మం ది కార్మికులు నష్టపోతున్నారని చెప్పా రు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆదాయం లేక బ్బందులు పడు తున్నట్టు చెపారు.

పచ్చదనం పెంచే కార్యక్రమాలు కొనసాగాలి

- 33 శాతం పచ్చదనం సాధనకు కృషిచేయాలి
- ఇసుక మాఫియా ఆటలు కట్టిస్తాం
- అటవీ అధికారులతో సమీక్షలో మంత్రి సురేఖ

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పచ్చదనం పెంచే కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. హరితహారంలో జరిగిన పురోగతి, రానున్న సీజన్ కోసం తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సచివాలయంలో మంత్రి సమీక్షించారు. అటవీ, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెచ్‌ఎండీఏ, సీహెచ్ఎంసీ, ఉద్యానశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అటవీ రక్షణ, పచ్చదనం పెంపు నిరంతర ప్రక్రియ అని, 33శాతం పచ్చదనం లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. తమ ఇంటి ఆవరణలో చెట్లు పెంచుతున్న వారికి కనీస ఆదాయం వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు. చింత, సీతాఫల్, ఉసిరి, జామ, నిమ్మ, సపోటా, మునగ, కరివేపాకు లాంటి మొక్కల పంపిణీకి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, సుభద్ర, కమిషనర్ హనుమంతరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా ఆగడాలను సహించం

భద్రాద్రి జిల్లా ఇల్లందు ఫారెస్ట్ డివిజన్ రేంజ్ పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మాఫియాను అడ్డుకునేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారులపై దుండగులు ట్రాక్టర్ ఎక్కించి హత్యకు యత్నించిన ఘటనపై మంత్రి తీవ్రంగా స్పందించారు. ఇలాంటి వాటిని ప్రభుత్వం సహించబోదని, దోషులు ఎంతటివారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని సురేఖ పేర్కొన్నారు.

బీసీబంధును అమలు చేయాలి

- నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ

హైదరాబాద్, జనవరి10 (నమస్తే తెలంగాణ): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీబంధు పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా యథావిధిగా అమలు చేయాలని నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీబంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున చెక్కులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కులవృత్తిదారులు ఆధునిక యంత్ర పరికరాలు, ముడిసరుకును కొనుగోలు చేసుకునేందుకు వీలుగా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా వచ్చే బడ్జెట్లో చేతి వృత్తులపైన ఆధారపడిన కులాలకు అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

పత్రికా ప్రకటన

భారత ప్రభుత్వం
పౌర విమానయాన మంత్రిత్వ శాఖ
రైల్వే సేఫ్టీ కమిషన్

సికింద్రాబాద్ డివిజన్‌లో హైదరాబాద్ స్టేషన్ వద్ద 10-01-2024న 8.42 గంటలకు రైలు నెం. 12759 (TBM-HYD) చార్మినార్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడం గురించి **చట్టబద్ధ విచారణ** జరుగుతుంది.

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుండి Ms. మాధవి, రైల్వే సేఫ్టీ కమిషనర్, సౌత్ సెంట్రల్ సర్కిల్, సికింద్రాబాద్‌వారు డివిజనల్ రైల్వే మేనేజర్ యొక్క కాన్ఫరెన్స్ హాల్, సంచాలన్ భవన్, సికింద్రాబాద్ వద్ద పై ఘటనపై 12-01-2024న 10.30 గంటలకు చట్టబద్ధ విచారణ జరుపుతారు.

పైన పేర్కొన్న ప్రమాదానికి సంబంధించిన అవగాహన కలిగిన మరియు దానికి సంబంధించిన విషయాలను గురించి తెలిసిన మరియు సాక్ష్యం ఇవ్వాలనుకునే ప్రయాణికులు విచారణ తేదీన పై ప్రదేశం వద్ద ఆ విధంగా చేయవచ్చును లేదా ఈ దిగువ అధికారిక చిరునామా వద్ద ఆమెకు వ్రాతపూర్వకంగా తెలియజేయవచ్చును.

రైల్వే సేఫ్టీ కమిషనర్, సౌత్ సెంట్రల్ సర్కిల్, రైల్ నిర్మాణ్ భవన్, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 025 లేదా ఫోన్ నెం. 040-27820104పై ఆమెను సంప్రదించవచ్చును.

A0039 జారీచేసినవారు : CPRO, దక్షిణ మధ్య రైల్వే.

PUB/0035

నాఫెడ్ ద్వారా 50వేల టన్నుల కందుల సేకరణ

- నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్ నియామకం
- నేటి నుంచి కొనుగోళ్లు ప్రారంభం
- సద్వినియోగం చేసుకోవాలి: తుమ్మల

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ధరల స్థిరీకరణ పథకం ద్వారా రాష్ట్రంలో పండించిన కందులను జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ సమాఖ్య(నాఫెడ్) ద్వారా కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా నాఫెడ్ ద్వారా 10 లక్షల టన్నుల కందులు సేకరించాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలో మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా ఎంపిక చేసింది. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా వ్యవసాయ మార్కెట్లు, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లు, ఎఫ్‌పీవోల ద్వారా 50వేల టన్నుల కందుల సేకరణకు రాష్ట్రప్రభుత్వం తెలంగాణ మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. గురువారం నుంచే కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

కోల్డ్ స్టోరేజీలను ఉపయోగించుకోండి

మిర్చికి మద్దతు ధర లభించకుంటే సరుకును మార్కెటింగ్ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వచేసుకునే అవకాశాలను పరిశీలించాలని మంత్రి తుమ్మల సూచించారు. నిల్వ చేసుకున్న సరుకుపై మార్కెటింగ్‌శాఖ అమలు చేస్తున్న రూ. 2లక్షల రైతుబంధు పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- మీడియాతో సీపీఐ జాతీయ నేత చాడ

హుస్నాబాద్, జనవరి 10: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖజానాకు లింకుపెట్టకుండా అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ఉద్యమకారుల అండదండలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

- 813 మందిని కండక్టర్లుగా నియమిస్తాం
- 10 ఏండ్ల పెండింగ్ సమస్య పరిష్కరిస్తాం
- 275 బస్సులు కొనుగోలు చేస్తాం
- గత నెలలోనే 80 కొత్త బస్సులు ప్రారంభించాం: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): టీఎస్ఆర్టీసీలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది వారసులకు కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. మరో 275 కొత్త బస్సుల కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చామని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు, కండక్టర్ పోస్టుల భర్తీ సమస్యలను పరిష్కరించబోతున్నట్టు చెప్పారు. కారుణ్య నియామకాల కింద 813 మందిని కండక్టర్లుగా నియమించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ (66), సికింద్రాబాద్ (126), రంగారెడ్డి (52), నల్లగొండ (56), మహబూబ్‌నగర్ (83), మెదక్ (93), వరంగల్ (99), ఖమ్మం (53), ఆదిలాబాద్ (71), నిజామాబాద్ (69), కరీంనగర్ (45) రీజియన్ల నుంచి 813 కండక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు మంత్రి వివరించారు.

80 కొత్త బస్సులు ప్రారంభించాం

మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నదని, బస్సులపై భారాన్ని తగ్గించేందుకు మరో 275 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి పొన్నం తెలిపారు. ఆర్టీసీ బలోపేతానికి గత నెలలోనే 80 కొత్త బస్సులను ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్టు గుర్తుచేశారు.

ఆవేశంతో ఆర్టీసీ సిబ్బందిపై దాడులొద్దు

- టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ఆవేశంలో ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేయొద్దని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్‌లో మంగళవారం ఓ వ్యక్తి బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనపై ఆయన స్పందించారు. ఈ ఘటనపై ఇప్పటికే ఆందోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిందని, దాడుల ఘటనలు వారిలో ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.